క్లుప్తంగా

బ్యాంకు ఖాతాల్లోనే పింఛను జమ

- నియోజకవర్గంలో 42,384 మందికి లబ్ధి

మాడుగుల రూరల్: సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు లబ్ధిదార్ల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదును జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు స్థానిక ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు బుధవారం తెలిపారు. దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, వీల్‌చైర్‌లో ఉండేవారు, నడవలేని వారికి సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందిస్తారని పేర్కొన్నారు. ఏప్రిల్ నెల పింఛన్లు సచివాలయాల వద్ద పంపిణీ చేయగా, గత నెల నుంచి బ్యాంకు ఖాతాలున్న లబ్ధిదారులకు వారి ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు తెలిపారు. జూన్ నెల కూడా అదే విధానాన్ని అవలంభిస్తామన్నారు. నియోజకవర్గ పరిధి మాడుగుల మండలంలో 11,998 మందికి, చీడికాడ 8,845, దేవరాపల్లి 10,439, కె.కోటపాడు మండలంలో 11,102 మందికి పింఛన్లు డీబీటీ, బ్యాంక్ ఖాతాల ద్వారా అందించనున్నట్లు వెల్లడించారు.

ఆర్జీఎల్ విత్తనాలకు ప్రత్యామ్నాయ రకాలు

- అందుబాటులో ఎంటీయూ 1224, 1064, 1318 రకం విత్తనాలు

రోలుగుంట: ఖరీఫ్ సాగుకు మండలంలో రైతులు ప్రాధాన్యత ఇస్తున్న ఆర్జీఎల్ రకం వరి విత్తనాలకు ప్రత్యామ్నాయ రకాలను శాస్త్రవేత్తలు ఎంపిక చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్జీఎల్ రకం వచ్చి 30 ఏళ్ల అయిందని, దీంతో విత్తన నాణ్యత, దిగుబడి తగ్గిపోవడాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారని పేర్కొన్నారు. అంతే కాకుండా తెగుళ్లు కూడా అధికమవడంతో ఆర్జీఎల్ స్థానంలో శాస్త్రవేత్తల సూచనల మేరకు ఎంటీయూ-1224, 1064, 1318 రకాలను అందుబాటులోకి తెచ్చినట్లు వెల్లడించారు. రైతుల్లో మాత్రం పూర్తి స్థాయిలో మార్పు రాలేదన్నారు. విత్తన వ్యత్యాసాన్ని తెలుసుకుని, శాస్త్రవేత్తల సూచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

తోడపెద్దు సంస్మరణ


తోడపెద్దు మట్టి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వేగి కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్: కె.జె.పురంలో వేగి వారి తోడపెద్దు సింహాద్రప్పన్న సంస్మరణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 18న తోడపెద్దు మరణించడంతో, అదే రోజు వేగి హరికృష్ణ కల్లం పాకల వద్ద పాన్పు చేశారు. బుధవారం జరిగిన సంస్మరణ కార్యక్రమంలో భాగంగా పేవగరిడీ నిర్వహించారు. పాన్పు చేసిన ప్రదేశంలో మట్టితో స్థానిక సూక్ష్మ కళాకారుడు శరగడం ప్రసాద్ తోడపెద్దును రూపొందించారు. ఉదయం నుంచి పూజలు నిర్వహించి, భారీ అన్నసమారాధన జరిపారు.

పుస్తక పఠనంతో ఆలోచనా శక్తి


గ్రంథాలయాల ఆవశ్యకతను వివరిస్తున్న అధికారి దమయంతి

నర్సీపట్నం: పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెరుగుతుందని స్థానిక గ్రంథాలయ అధికారి పి.దమయంతి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా గ్రంథాలయాల వలన కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. గ్రంథాలయాలకు రావటం అలవాటుగా మార్చుకోవాలన్నారు. పుస్తక పఠనంతో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు సీహెచ్ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు డిబేట్, చిన్నపిల్లలకు కథల పోటీలు నిర్వహించారు.


బుక్ రీడింగ్‌పై వివరిస్తున్న గ్రంథాలయ అధికారి రాజుబాబు

గొలుగొండ: విద్యార్థులు చిన్న తనం నుంచే బుక్ రీడింగ్‌పై అవగాహన పెంచుకోవాలని, గ్రంథాలయాల్లోని విలువైన పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంచుకోవాలని గ్రంథాలయ అధికారి రాజుబాబు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు బుక్ రీడింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు మ్యూజికల్ చైర్ గేమ్ ఆడించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.


టీడీపీ హయాంలో విత్తనాల కొనుగోలుకు మాడుగులలో గుమికూడిన రైతులు(ఫైల్)


ఎల్.పొన్నవోలు ఆర్బీకేలో రైతులకు విత్తనాలు అందిస్తున్న సిబ్బంది

నాడు గత ప్రభుత్వ హయాంలో మట్టి మనిషికి విత్తన కష్టాలు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వ విత్తన కొనుగోలు కేంద్రాలు అరకొరగానే ఉండేవి. వాటికోసం మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిందే. అక్కడ కొండవీడు చాంతాడంత క్యూలైన్లు, పైరవీలు, రాజకీయ పలుకుబడి ఉన్నవారికే విత్తనాలు దక్కేవి. మిగిలిన రైతులు ప్రైవేట్ విత్తన కేంద్రాల్లో కొనుగోలు చేసి, నకిలీల బారిన పడి తీరని కష్టాలకు గురయ్యేవారు.

నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయం పండగలా మారింది. రైతే రాజయ్యాడు. ఊరు దాటాల్సిన పనిలేకుండా సచివాలయం/ఆర్బీకే పరిధిలోనే అన్ని సేవలూ అందుబాటులోకి వచ్చాయి. ఖరీఫ్, రబీ సీజన్లలో ముందుగానే తనకు కావాల్సిన విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకుంటే చాలు. ఉన్న ఊరిలోనే నాణ్యమైన విత్తనాలు అందుకుంటున్నారు. కల్తీల భయం అసలే లేదు.

విత్తనాల వెతలు తీరె..

- నాడు విత్తనాల కోసం నానా అగచాట్లు
- నేడు ఆర్బీకేల ద్వారా ఉన్న ఊరు దాటనక్కర్లేదు
- ఖరీఫ్, రబీ సీజన్లలో విత్తనాల విక్రయం సులభతరం
- జోరుగా ఖరీఫ్ వరి విత్తనాలకు ముందస్తు రిజిస్ట్రేషన్లు

మాడుగుల రూరల్: గత ప్రభుత్వ హయాంలో ఖరీఫ్, రబీ విత్తనాల కోసం రైతుల కష్టాలు వర్ణనాతీతం. ఆయా సీజన్లలో విత్తనాలు తెచ్చుకునేందుకు మండల, జిల్లా కేంద్రాలకు ఒకటి కంటే ఎక్కువసార్లే వెళ్లాల్సి వచ్చేది. మండల వ్యవసాయాధికారి ఆధ్వర్యంలో విత్తనాల విక్రయాలు జరిపినా.. రైతులకు సరిపడా అందుబాటులో లేని దుస్థితి. చాలీచాలని విత్తనాలను మాడుగులోని ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో ఏర్పాటు చేసిన విత్తన గోదాంలో నిల్వచేసి, విక్రయించేవారు.

29 పంచాయతీలకు ఒకే చోట

మండలంలో 29 గ్రామ పంచాయతీలున్నాయి. అన్ని గ్రామాలకూ కలిపి ఒకే చోట విత్తన గోదాం ఏర్పాటు చేసేవారు. రాజకీయ పలుకుబడి, పైరవీలు చేసేవారికే విత్తనాలు దొరికేవి. విత్తనాల కోసం రోజూ రైతులు మండల కేంద్రానికి వెళ్లడం, గంటల తరబడి నిరీక్షించడం, నిరాశగా తిరుగుముఖంపట్టడం జరిగేది. తిరిగి తిరిగి విసిగిపోయి ప్రైవేట్ వర్తకుల వద్ద అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వచ్చేది. అందులోనూ చాలా వరకు నకిలీల బారిన పడే దుస్థితి. ఇప్పుడు దానికి భిన్నమైన పరిస్థితి. గ్రామ స్థాయిలో సచివాలయం ఏర్పాటు, దాని పరిధిలో రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) ఏర్పాటుతో రైతుల కష్టాలన్నీ తీరాయి.

అన్ని సేవలూ ఆర్బీకేలోనే..

మండలంలో 23 సచివాలయాలున్నాయి. వీటి పరిధిలో 23 ఆర్బీకేలను నిర్మించారు. ఈ కేంద్రాల్లో ఆయా సచివాలయ వీఏఏ, వీహెచ్‌ఏ, వెటర్నరీ, మత్స్యశాఖ సహాయకులను నియమించారు. వీరి ఆధ్వర్యంలో అన్ని రకాల విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను విక్రయిస్తున్నారు. విత్తనాల కోసం ముందస్తుగా రిజిస్ట్రేషన్ చెయించుకుని, ఏ రైతుకు ఎన్ని కిలోలు/బస్తాలు కావాలో తెలుసుకుని, ఆ మేరకు అందిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సకాలంలో విత్తనాలు సరఫరా చేస్తున్నారు.

సకాలంలో విత్తనాలు



ఖరీఫ్, రబీ సీజన్లలో నిర్ణీత సమయానికే విత్తనాలు రైతులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామస్థాయిలో సచివాలయ వ్యవస్థ ద్వారా రైతులకు అన్ని సేవలూ గ్రామస్థాయిలో లభిస్తున్నాయి. ఆర్బీకేల ద్వారా సాగుకు అవసరమైన సేవలన్నీ చాలా గొప్ప గా అందిస్తున్నారు. గతంలో విత్తనాల కోసం మాడుగుల వెళ్లేవాళ్లం. పలుకుబడి ఉన్నవారికి మాత్రమే విత్తనాలు అందేవి. మాలాంటి చిన్న, సన్నకారు రైతులకు విత్తనాలు చాలాసార్లు దొరికేవి కావు.

– పోతుబంది రాజుబాబు, రైతు, ఎం.కోటపాడు

నాటి ఇబ్బందుల్లేవు



నాడు విత్తనాల కోసం పడిన ఇబ్బందులు ఎప్పటికీ మర్చిపోలేం. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులు మచ్చుకైనా కానరావు. ఈ ప్రభుత్వంలో రైతు ముంగిటకే సేవలు అందుతున్నాయి. గతంలో వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కావాలనుకుంటే మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయానికి వెళ్లేగానీ దొరికేవి కావు. అవి కూడా రైతులందరికీ అందించే పరిస్థితి లేదు. పైరవీలకే పెద్ద పీట వేసేవారు. నేడు ఆ పరిస్థితి లేదు.

– మారిశెట్టి నర్సింగరావు, రైతు, కె.జె.పురం

కాలిన మోటార్లు.. నిలిచిన తాగునీరు

మాకవరపాలెం: తాగునీటి ప్రాజెక్టు మోటార్లు కాలిపోవడంతో సుమారు 25 గ్రామాలకు తాగునీటి సరఫరా జరగలేదు. మండలంలోని అన్ని గ్రామాలకు గిడుతూరు, లచ్చన్నపాలెంలోని సర్పా, వరాహనదుల్లో చేపట్టిన తాగునీటి ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అయితే నాలుగు రోజుల క్రితం గిడుతూరు ప్రాజెక్టు పైప్‌లైన్‌కు రంధ్రం పడింది. దీంతో మూడు రోజులపాటు సుమారు 40 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో పైప్ లైన్‌కు మరమ్మతులు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించారు. ఇంతలో లచ్చన్నపాలెం ప్రాజెక్టులో ఉన్న మూడు మోటార్లు కాలిపోవడంతో బుధవారం నుంచి మరో 25 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోయింది. స్థానికంగా తాగునీటి సరఫరా వ్యవస్థల్లో నీటిని నింపేందుకు ఉన్న బోర్లు మరమ్మతులకు గురైనా పంచాయతీ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టుల నుంచి నీటి సరఫరా జరుగుతుండటంతో స్థానికంగా ఉన్న బోర్ల వినియోగంపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్తున్నారు. యరకన్నపాలెం, లచ్చన్నపాలెం, మాకవరపాలెంతోపాటు మరికొన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉందంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ వేసవిలో సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


పాడైపోయిన ప్రాజెక్టు మోటార్లు

2న ఒమ్మలి మోదమాంబ పండగ

మాడుగుల: మండలంలోని ఒమ్మలి గ్రామంలో ఈ నెల 2న మోదమాంబ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం తెలిపారు. పండగ సందర్భంగా ఆ రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతామన్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. భక్తులు విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

హంస కోటవురట్ల యూనిట్ అధ్యక్షుడిగా శివకుమార్


కార్యవర్గ సభ్యులను సత్కరించిన జిల్లా కమిటీ సభ్యులు

మాకవరపాలెం: ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) కోటవురట్ల యూనిట్ అధ్యక్షుడిగా స్థానిక పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా శివకుమార్, కార్యదర్శిగా సరస్వతి, కోశాధికారిగా రమణ, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని జిల్లా కమిటీతోపాటు సహ ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చినబాబు, కార్యదర్శి బాబీ తదితరులు పాల్గొన్నారు.

వంటలపై భోజన నిర్వాహకులకు అవగాహన

మాకవరపాలెం: మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వంటల తయారీపై అవగాహన కల్పించారు. మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం వీడియోల ద్వారా వంటలు తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కె.రాము మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతో సోమవారం నుంచి శనివారం వరకు విద్యార్థులకు అందించే మెనూలో ఏయే రకాల వంటలు చేయాలి, వాటిని వండే విధానం, పోషక విలువలపై నిర్వాహకులకు అవగాహన కల్పించామన్నారు.


వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆర్‌ఎంపీ క్లినిక్‌ల తనిఖీలు


ఆర్‌ఎంపీ వైద్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్యాధికారి హరిప్రవీణ్

గొలుగొండ: ఏఎల్ పురం(కృష్ణదేవిపేట) గ్రామ పరిధిలోని ఆర్‌ఎంపీ వైద్యులు నిబంధనల మేరకు వైద్య సేవలు అందించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కృష్ణదేవిపేట వైద్యాధికారి హరిప్రవీణ్ హెచ్చరించారు. ఆయన మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం స్థానిక ఆర్‌ఎంపీ వైద్యులు నిర్వహించే క్లినిక్‌లను తనిఖీ చేశారు. వారి సర్టిఫికెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందించడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రతి ఆర్‌ఎంపీ క్లినిక్‌ను పరిశీలించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే నోటీసులు జారీ చేస్తామన్నారు.


కార్డన్ సెర్చ్‌లో 37 వాహనాల స్వాధీనం

రావికమతం: నేర నియంత్రణలో భాగంగా కొత్తకోట సీఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో దొండపూడి, మత్స్యవానిపాలెంలలో బుధవారం నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో సరైన పత్రాల్లేని 37 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అల్లర్లకు తావులేకుండా బయటి వ్యక్తుల్ని నివారించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 34 బైక్‌లు, రెండు కార్లు, ఒక ట్రాక్టర్ ఉందన్నారు. కార్యక్రమంలో కొత్తకోట ఎస్‌ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఆర్బీకేలకు ఖరీఫ్ వరి విత్తనాలు

దేవరాపల్లి: మండలంలోని రైవాడ రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సరఫరా చేసేందుకు అవసరమైన విత్తనాలతో లారీలు బుధవారం ఆర్బీకేలకు చేరాయి. వీటిని స్థానిక వ్యవసాయ శాఖ అధికార్లు భద్రపరిచారు. ఆర్‌జీఎల్, ఇంద్ర, సోనామసూరి, అమర్ తదితర రకాల వరి విత్తనాలు ఉన్నాయి. మండలంలోని 20 ఆర్బీకేలకు ఇండెంట్ మేరకు విత్తనాలు అందుబాటులోకి రాగానే రైతులకు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికార్లు చెబుతున్నారు.


రైవాడ ఆర్బీకేలో సిద్ధంగా ఖరీఫ్ వరి విత్తనాలు

అగ్నిప్రమాదాలపై అవగాహన

మాడుగుల: అగ్ని ప్రమాదాలు వాటిల్లకుండా ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని మాడుగుల అగ్నిమాపక కేంద్రం దళాధికారి వి.రాజేశ్వరావు తెలిపారు. అగ్ని ప్రమాదాలు-నివారణ అంశంపై స్థానిక శ్రీనివాస ఆస్పత్రి వద్ద బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యానికి వంట గ్యాస్ వల్ల జరిగే అనర్థాలపై డెమో ఇచ్చారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

- మండల పరిషత్ సమావేశంలో ఎంపీపీ లక్ష్మణమూర్తి


సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి కోరారు. ఎంపీపీ అధ్యక్షత బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముందుగా గత సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించిన అంశాలను అధికారులు ఎంత మేరకు పరిష్కరించారో.. ఆ వివరాలను ఎంపీడీవో జాగరపు రాంబాబు వివరించారు. అనంతరం ఎంపీపీ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ వేసవి కారణంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

- వచ్చే నెలలో పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో విద్యార్థులకు కావాల్సిన పాఠ్య పుస్తకాలు సకాలంలో పాఠశాలలకు చేరేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు మిగులు పనుల్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు.
- పీహెచ్‌సీల పరిధిలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారుల్ని సూచించారు.
- ఉపాధి కూలీలకు సక్రమంగా పనులు కల్పించాలన్నారు.
- జగనన్న కాలనీ లే అవుట్లలో అసంపూర్తిగా మిగిలిన ఇళ్లను వెంటనే పూర్తి చేసేలా లబ్ధిదారుల్ని ప్రోత్సహించాలని హౌసింగ్ అధికారులను కోరారు.
- ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు అవసరమైన వరి విత్తనాలను సకాలంలో అందించేందుకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విత్తనాల పంపిణీలో జాప్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.
- వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగు పరచాలని సూచించారు.
- ఐసీడీఎస్ కేంద్రాల్లో సేవలు సంతృప్తికరంగా ఉండేలా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు.

అనంతరం శాఖల వారీగా మండల వ్యాప్తంగా చేపట్టిన పనుల పురోగతిపై అధికారులు వివరించారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల సిబ్బంది సమాధానాలిచ్చారు. ముందుగా మండల వ్యాప్తంగా ఎలాంటి తగాదాల్లేకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు సహకరించిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాపారపు అప్పలనర్స, ఎంపీడీవో రాంబాబు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిరుసుపల్లి నర్సింగరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీగౌరి, ఎంఈవో తాడి అమృత్‌కుమార్, నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రాజేష్‌నాయుడు, జేతబు జోగారావు, రాజేష్, శ్రీవేంకటేశ్వరమ్మ, మండల స్థాయిల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- నియోజకవర్గానికి 14 టేబుళ్లు, 19 రౌండ్లు
- నర్సీపట్నం రిటర్నింగ్ అధికారి జయరాం



నర్సీపట్నం: వచ్చే నెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు నర్సీపట్నం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హెచ్.వి.జయరాం తెలిపారు. కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో 262 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి, 14 టేబుళ్ల కేటాయించి, 19 రౌండ్లలో లెక్కింపు ఉంటుందన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, అనంతరం ఈవీఎంల ఓట్ల కౌంటింగ్ ప్రారంభిస్తామన్నారు. గొలుగొండ మండలం, పాత కేడీ పేట 1వ పోలింగ్ కేంద్రం నుంచి కౌంటింగ్ మొదలుకానుందన్నారు. ఆఖరుగా మాకవరపాలెం మండలం, సుబ్రహ్మణ్యపాలెం పోలింగ్ బూత్ లెక్కింపుతో నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియ ముగుస్తుందన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించేదిలేదన్నారు. రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


బాలలకు నీతి కథలు వినిపిస్తున్న ఉపాధ్యాయుడు ప్రకాష్


పిల్లలచే బుక్‌రీడింగ్ చేయిస్తున్న గ్రంథ పాలకురాలు వరహాలమణి

రావికమతం: కొత్తకోట శాఖా గ్రంథాలయంలో ఆటలు పోటీలు, కథలు, బుక్ రీడింగ్ బుధవారం నిర్వహించారు. బాల బాలికలకు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా హైస్కూల్ ఉపాధ్యాయుడు ప్రకాష్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆట పాటలతోపాటు, పుస్తక పఠనం, నీతి కథలు చెబుతూ వారికి ఏయే అంశాల్లో మక్కువ ఉందో తెలుసుకుని, తర్ఫీదునిస్తున్నారు. ఇందులో భాగంగా పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు జూన్ 7న ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందించనున్నట్లు వరహాలమణి తెలిపారు.

మండుతున్న ఎండలు.. జనం బెంబేలు


రోలుగుంటలో నిర్మానుష్యంగా వడ్డాది-నర్సీపట్నం ఆర్ అండ్ బీ రోడ్డు


ఎండలతో జనాల్లేక బోసిపోయిన సింగన్నదొరపాలెం కూడలి

రోలుగుంట/మాడుగుల రూరల్/కె.కోటపాడు: వారం రోజులుగా ఎండల తీవ్రతకు జనాలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకూ ఎండ తీవ్రతలో పెద్దగా మార్పుల్లేవు. రోహిణీ కార్తె తోడవడంతో గాలి స్తంభించి, ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వ్యాపారులు 10 గంటల తర్వాత దుకాణాల షట్టర్లు మూసుకుని, ఇంటి బాట పడుతున్నారు. ఎండల తీవ్రతకు నిత్యం వాహన రద్దీ ఉండే వడ్డాది-నర్సీపట్నం ఆర్ అండ్ బీ రోడ్డు పగటిపూట నిర్మానుష్యంగా మారుతోంది.

- మాడుగుల మండలంలో గత ఐదు రోజులుగా కాస్తున్న ఎండలకు ప్రజలు ఇంటి నుంచి బయటికి వచ్చేందుకే భయపడుతున్నారు. వారం క్రితం వరకు అడపా దడపా కురిసిన వర్షాలకు ఎండ పెద్దగా ఇబ్బంది పెట్టలేదు. ఇప్పుడు మాత్రం ఉదయం 8 నుంచి సాయంత్రం 6 వరకు మండుతున్న ఎండలు, ఉక్కబోత వాతావరణంతో జనాలు అల్లాడిపోతున్నారు. ఉపాధి కూలీలు, వ్యవసాయదార్లు ఉదయం 9 గంటలకే పనులు ముగించుకుని ఇంటి ముఖం పడుతున్నారు.
- కె.కోటపాడు మండల గ్రామాల్లో గత మూడు రోజులుగా పగటి వేళ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయాందోళన చెందుతున్నారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.